
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 9 । జనవరి । 2024



పింఛన్ల పెంపు చరిత్రాత్మకం

అర్హులందరికీ పింఛన్ మంజూరు చేయడమే జగనన్న ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. 9లో



వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు ప్రసాదం అందజేశారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–తిరుపతి (08583) స్పెషల్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా సోమవారం రాత్రి 11 గంటలకు బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సి ఉంది.

న్యూస్‌రీల్

గజ..గజ



సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి చలితీవ్రత పెరిగింది. ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీలు, చింతపల్లిలో 11.5డిగ్రీలు, అరకులోయలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

11,12 తేదీల్లో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ

చింతూరు: మండల కేంద్రం చింతూరులో ఈనెల 11,12 తేదీల్లో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడను అభివృద్ధి చేయడంలో భాగంగా రెండు రోజుల పాటు ఈ టోర్నమెంటు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



వట్టిగెడ్డలో పొగాకు కొనుగోలు చేస్తున్న బయ్యర్లు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా వైట్‌బర్లీ పొగాకు కొనుగోళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. గత ఏడాది క్వింటాలు ధర రూ.11,500 కాగా, ఈ ఏడాది రూ. 15వేలకు ధర పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని లబ్బర్తి, ఒట్టిగెడ్డ, రాజవొమ్మంగిలలో దాదాపు 30 వేల కిలోల పొగాకును ఐటీసీ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్లు సంక్రాంతి పండగ వరకు ప్రతి రోజు కొనసాగుతాయని బయ్యర్లు మంజునాథ్, బసవరాజు తెలిపారు. సూపర్‌వైజర్ నాయుడుబాబు పర్యవేక్షించారు. మండల పరిసరాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో పొగాకు పండిస్తున్నారు. ఈ ఏడాది కొత్త వంగడాలైన వీవీహెచ్-6 వీవీహెచ్-3, విన్-5లను రైతులు సాగు చేశారు. ఎకరాకు సుమారు 1500 క్వింటాళ్ల దిగుబడి సాధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

రాజవొమ్మంగి: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం ప్రవీణ్ (29) బైక్‌పై వెళ్తూ చెరకుంపాలెం వద్ద సోమవారం రాత్రి సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. జడ్డంగి అడిషినల్ ఎస్‌ఐ ఎం.ఎస్.ఎన్.రాజు తెలిపిన వివరాల ప్రకారం ప్రవీణ్ మండలంలోని సంజీవనగరంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా చెట్టును ఢీ కొట్టాడు. అతి వేగం వల్ల వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగినట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

తుమ్మపాల : భారత ప్రభుత్వ సంస్థ (సీపీఈటీ), ఎన్టీపీసీ సింహాద్రి (విజయవాడ) సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు సీపీఈటీ జాయింట్ డైరెక్టర్, హెడ్ సీహెచ్.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికత ఉండి, 10 వ తరగతి పాసై 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల 60 మందికి విజయవాడ పోలిమెర్స్ టెక్నాలజీలో 6 నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3వేలు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఆసక్తి గల యువత సీపీఈటీ ప్రతినిధి బాణావత్ అంజి నాయక్‌ని 7893586494 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు



రంపచోడవరం మండలం తామరపల్లిలో సేకరించిన ధాన్యాన్ని లోడ్ చేస్తున్న సిబ్బంది

- లక్ష్యం 28 వేల మెట్రిక్ టన్నులు
- రాగులకూ గిట్టుబాటు ధర

సాక్షి, పాడేరు: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ సేకరిస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించడంతో రెండు నెలలుగా పౌరసరఫరాలశాఖ, వ్యవసాయశాఖ ఎంపిక చేసిన ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ధాన్యం మిల్లర్ల సహకారంతో ఎప్పటికప్పుడు కొనుగోలుచేసిన ధాన్యాన్ని ఆయా మిల్లర్లకు తరలిస్తున్నారు. ఇప్పటికి 8,542 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు సుమారు రూ. రెండు కోట్ల నగదు చెల్లింపులు జరిగాయి. జనవరి నెలఖారు నాటికి ధాన్యం సేకరణ లక్ష్యాలను పూర్తిచేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎప్పటికప్పుడు పౌరసరఫరాలశాఖ, వ్యవసాయ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

300 టన్నుల రాగులు కొనుగోలు లక్ష్యం

పాడేరు డివిజన్‌లోని విస్తారంగా సాగవుతున్న రాగులను కూడా రైతుల నుంచి గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నారు. 300 టన్నుల రాగులను కొనుగోలుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 37 టన్నుల రాగులను పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసింది. ఆర్బీకే కేంద్రాలతో పాటుగా ప్రధాన వారపు సంతల్లో కూడ కొనుగోలు చేపడుతున్నారు.

లక్ష్యాలను పూర్తిచేస్తాం

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగైన ధాన్యం కొనుగోలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తాం. ఎంపిక చేసిన ఆర్బీకేల ద్వారా ధా న్యం, రాగులు కొనుగోలు చేస్తున్నాం. గిట్టుబాటు ధరలపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. దళారులను నమ్మి మోస పోకుండా రైతుల నుంచి ధాన్యం, రాగులు కొనుగోలు చేస్తున్నాం..

– గణేష్‌కుమార్, పౌరసరఫరాలశాఖ డీఎం

• ముందే వచ్చిన సంక్రాంతి

ముత్యాల ముగ్గులు.. ముచ్చటైన గొబ్బెమ్మలు.. కీర్తన పాడుతూ సాగిపోయే హరిదాసులు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ఇలా సంక్రాంతి సందడంతా సోమవారం పలు కళాశాలలు, పాఠశాలల్లో ప్రతిఫలించింది. జిల్లా అంతటా పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరిపారు. విద్యార్థులు ఆటపాటలతో సరదాగా గడిపారు. – సాక్షి న్యూస్ నెట్‌వర్క్



చింతపల్లిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు





చింతూరు డిగ్రీ కళాశాలలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు

సమస్యలపై తక్షణ ‘స్పందన’

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్‌గనోరే, సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: గిరిజనుల సమస్యలపై వెంటనే స్పందించి, పరిష్కార చూపడం ద్వారా స్పందన కార్యక్రమంపై మరింత నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందనకు 32 అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

- రంపచోడవరం మండలంలోని కాకవాడ నుంచి కొయ్యలగూడెం గ్రామం వరకు తొమ్మిది కిలోమీటర్ల తారురోడ్డు మంజూరు చేశారని, మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు జరిగాయని, మరో ఆరు కిలోమీటర్ల పనులు అటవీ అభ్యంతరాలతో నిలిచిపోయాయని, వెంటనే పూర్తి చేయాలని ఆకూరు సర్పంచ్ పండ్ర సరస్వతి, ఎంపీటీసీ నర్రా పాపారావుతో పాటు మరో 50 మంది పీవోకు అర్జీ అందజేశారు.
- రంపచోడవరం మండలం వేములకొండ గ్రామం నుంచి దేవీపట్నం మండలం తున్నూరు గ్రామం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని చింతలగూడెం, మామిడివలస, బడిగుంట, తున్నూరు గ్రామాల గిరిజనుల కోరారు.
- రంపచోడవరం మండలంలోని పెద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించాలని తున్నూరు పంచాయతీ సర్పంచ్ సాదల విజయభాస్కర్ రెడ్డి, పల్లాల విశ్వనాథ రెడ్డి, పల్లాల లచ్చిరెడ్డి దరఖాస్తు అందజేశారు.
- మారేడుమిల్లి మండలం సిరిపురం గ్రామంలోని పదిమంది గిరిజన రైతులకు 10 పవర్ టిల్లర్లు సబ్సిడీపై మంజూరు చేయాలని సుండం సత్యనారాయణ దొర, గుబతాల చంద్ర మాణిక్యాలరావు, చుండం వీరస్వామి అర్జీ అందజేశారు.
- రంపచోడవరం మండలంలోని పాత గాంధీ నగరంలో సర్వే నంబర్ 6/3బి 1లో సుమారు రెండున్నర ఎకరాల భూమి సమస్య పరిష్కరించాలని కురుసం అబ్బాయి దొర దరఖాస్తు సమర్పించారు.
- రంపచోడవరం మండలం బీరపల్లి గ్రామంలో సర్వేనంబర్ 6/1లో సుమారు 9 ఎకరాల భూమికి సంబంధించిన సమస్య పరిష్కరించాలని చోడి బాపిరాజు, చెదల లచ్చిరెడ్డి దరఖాస్తు అందజేశారు. స్పందన కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, డీడీ అబ్బులాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచ పాండవులు, భైరవ మూర్తి జాతర



తోంకోటలో పంచపాండవుల విగ్రహాలు



పూజలు నిర్వహించేందుకు వస్తున్న భక్తులు

హుకుంపేట: అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దు గ్రామమైన తోంకోటలో వెలసిన గిరిజనుల ఆరాధ్యదైవమైన పంచపాండవులు, భైరవ మూర్తి జాతర ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. రాత్రి ఒంటిగంట నుంచి భక్తులు స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు,నృత్యాలతో ఆలయానికి వెళ్లారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

కుటుంబ కలహాల కారణంగా కత్తితో దాడి



బాధితుడికి చికిత్స చేస్తున్న వైద్యుడు

చింతపల్లిరూరల్: కుటుంబ కలహాల కారణంగా అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేసిన సంఘటన జీకే మండలం రంపుల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.

స్థానికులు అందించిన వివరాలు ప్రకారం కంకిపాటి శ్రీనుపడాల్ తన పెద్దనాన్న కొడుకు అయిన వంటి కంకిపాటి త్రిమూర్తుల తలపై కత్తితో దాడి చేశాడు. కుటుంబ గొడవలు కారణంగా ఈ సంఘటన జరిగినట్టు స్థానికులు తెలిపారు. బాధితుడిని పెదవలస ఆస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఆస్పత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ వి.రమేష్ చికిత్స అందించారు.

చాపరాయి వద్ద పలు అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతం వద్ద రూ.60 లక్షల వ్యయంతో నిర్వహించిన పలు అభివృద్ధి పనులను కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ చాపరాయి ముఖద్వారం నుంచి జలపాతం వరకు మెట్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గదులు నిర్మించినట్టు చెప్పారు. పర్యాటకుల కోసం తాగునీటి సౌకర్యం, జలపాతంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పిల్లల కోసం ఆట పరికరాలు సమకూర్చినట్టు చెప్పారు. చాపరాయి ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పర్యాటకులు జలపాతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పీవో ప్రత్యేకంగా దృష్టి పెట్టి జలపాతాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయక ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, మ్యూజియం క్యూరేటర్ మురళీ,పద్మాపురం మేనేజర్ బొంజుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీడీవో ఉషారాణి, సర్పంచ్ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీరాములు, శెట్టి గోపాల్, బాక సింహాచలం , పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతి ,లీలారాణి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

మారేడుమిల్లి: ఓ మహిళ 108 వాహనంలో ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఉత్తలూరు గ్రామానికి చెందిన పి.దివ్యశ్రీ (26)కి సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. భర్త, బంధువులు మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించారు.

అక్కడ పరీక్షించిన వైద్యులు రంపచోడవరం రిఫర్ చేశారు. 108 వాహనంలో తరలిస్తుండగా సున్నంపాడు వద్ద నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ వెంకటేష్, పైలెట్ మనోజ్ ప్రసవం చేశారు. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి,బిడ్డలను గెద్దాడ ఆస్పత్రిలో చేర్చారు.ఇది ఈమెకు రెండో ప్రసవం.

విప్లవాత్మక రీతిలో పింఛన్ల పంపిణీ

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



ముంచంగిపుట్టులో పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: దేశంలో మరెక్కడా లేని విధంగా విప్లవాత్మక రీతిలో రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, రూ.మూడు వేలకు పింఛన్ నగదును పెంచి అవ్వాతాతల కళ్లలో ఆనందాన్ని నింపారని తెలిపారు.

ఒక్క ముంచంగిపుట్టు మండలంలోనే 6,426 మందికి రూ.2కోట్ల పింఛన్‌ను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. 2024లోనూ ముఖ్యమంత్రిగా జగనన్నను ప్రజలు గెలిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, ఎంపీడీవో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల నేతలు మూర్తి, జయదేవ్, తిరుపతి, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

గిరిజన గ్రామాల్లో ఎన్నడూ చూడని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. సుజనకోట పంచాయతీ గోడిపుట్టు గ్రామంలో జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల సౌకర్యం కల్పించి, రవాణా వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు



చింతూరులో విద్యార్థులకు ట్యాబ్‌లు అందచేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు వారు ట్యాబ్‌లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని, ప్రతి పేదవాడికి విద్యను అందుబాటులో తేవాలనే లక్ష్యంతో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు చేపట్టారని వారు తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రతి పాఠశాల రూపురేఖలు మార్చారని, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. చింతూరు మండలంలో 750 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం జరిగిందని, పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై విద్యార్థులు దృష్టి సారించాలి



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: లక్ష్య సాధనపై విద్యార్థులు దృష్టి సారించాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు శాఖ, సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యార్థినులకు దుస్తులు, రైటింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. 250 మందికి నూతన దుస్తులు, 200 మంది టెన్త్ విద్యార్థినులకు రైటింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోను, విద్యాలయాల్లోను ఎటువంటి సమస్యలు తలెత్తినా తమకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మండలంలో నుర్మతి, కేజీబీవీ, ఏకలవ్య, బందవీధి, మినీగురుకులం ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు ఇక్కడకు వచ్చేందుకు బస్సు సౌకర్యంతో పాటు, భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 198 బీఎన్ ఏవోసీ ఓసీ ఉదయ్, ఇన్‌స్పెక్టర్ టి.బెహిర, స్థానిక సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జన్‌మన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



కొత్తభల్లుగుడ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయటౌన్: ఈనెల 15న చేపట్టనున్న జన్‌మన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. కొత్తభల్లుగూడలో జరుగుతున్న జన్‌మన్ కార్యక్రమం ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. అర్హులైన పీవీటీజీలకు ఆయుష్మాన్, ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎంకెవై పథకం అందజేయాలని, ఉపాధి జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, ఇంటింటికీ కుళాయి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, పీఆర్ ఈఈ కొండయ్య పడాల్, తహసీల్దార్ వేణు, ఎంపీడీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం

తాటిచెట్లపాలెం(విశాఖ) : రైళ్లలో గంజాయి రవాణా, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈమేరకు నిఘా మరింత పటిష్టం చేయనున్నామని సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు రాహుల్‌దేవ్ తెలిపారు. విశాఖ రైల్వే స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రైళ్లలో జరిగే దొంగతనాలు, గంజాయి రవాణాపై రైల్వే పోలీస్ అధికారులతో చర్చించారు. రైళ్లలో దొంగతనాలు, గంజా రవాణా జరగకుండా సీసీ కెమెరాలు, లగేజీ స్కానర్‌లు, మెటల్ డిటెక్టర్‌లతో పాటు , స్నిఫర్ డాగ్‌ల సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు రాహుల్‌దేవ్ తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నాలకు చెందిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసులు, ఇన్‌స్పెక్టర్‌లు, లైన్స్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో మూడు టీచర్ పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్జీటీ ఒక పోస్టుకు 11 మంది, సంస్కృతం ఒక పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మ్యాథమెటిక్స్ పోస్టుకు ఐదుగురు అభ్యర్థులు హాజరయ్యారు. క్వీన్ మేరీస్ పాఠశాల హెచ్‌ఎం సోమనాథ్, దేవస్థానం సూపరింటెండెంట్ విక్రమ్ తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఎఫ్‌పీవోలతో రైతులకు లాభాలు


ఎఫ్‌పీవో నూతన కార్యవర్గం

చింతపల్లిరూరల్: మండలంలో కొత్తపాలెం పంచాయతీ పినపాడు గ్రామంలో జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ కో–ఆపరేటివ్ సొసైటీ నూతనంగా ఏర్పడింది. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానవన, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బిందు, ఉజ్వల రాణి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి రైతులకు అధిక ధరలు పొందవచ్చన్నారు. మన్యంలో పండే సుగంధ ద్రవ్యాలు, కాఫీ, మిరియాలు వంటివి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నాయన్నారు. ఈ ఎఫ్‌పీవోల ద్వారా రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తు, గిట్టుబాటు ధరలు అందించవచ్చొన్నారు. అలాగే రైతులకు అవసరమైన యంత్ర సామగ్రి రైతులకు అందేలా ఈ ఎఫ్‌పీవోలు సహకరిస్తాయన్నారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎఫ్‌పీవో ఎండీ అనుఫ్ పాల్గొన్నారు.

బడులకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్టు అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఈనెల 19న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని ఆమె పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం


కుంబిడిసింగిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్

జి.మాడుగుల/పాడేరు: కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటన్నింటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తెలిపారు. జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ కుంబిడిసింగిలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రమేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని చెప్పారు. ఇంతకు ముందు పాడేరులో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుసా రాజారావు,జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి నూకరాజు, జిల్లా కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

అరకులోయలో పర్యటించిన పురందేశ్వరి


మ్యూజియాన్ని సందర్శించిన పురందేశ్వరి తదితరులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సోమవారం పర్యటించారు. కాఫీ మ్యూజియాన్ని సందర్శించారు. కాఫీ తయారీ విధానాన్ని స్థానిక గైడ్‌ల నుంచి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో అరకు కాఫీకి మంచి పేరు ఉందని, కాఫీ తోటలు పెంపకంతో పాటుగా ప్రకృతి ప్రత్యేకతలు పర్యాటకాభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. కేంద్ర పర్యాటక శాఖ ద్వారా దర్శనీయ క్షేత్రాలతో పాటు సందర్శన ప్రాంతాలను అభివృద్ధి చేసినట్టు ప్రధాని మోదీ మన్ కి బాత్‌లో ప్రస్తావించారన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, పాంగి రాజారావు తదితరులున్నారు.